సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



నాణ్యమైన వైద్యం పేదలకు దూరం

కూటమి ప్రభుత్వం నాణ్యమైన వైద్యాన్ని పేద ప్రజలకు దూరం చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. ఆదివారం ఆయన మాట్లాడారు. -8లో



సౌత్‌జోన్ మల్టీడే మ్యాచ్ ప్రారంభం

ఏసీఏ సౌత్‌జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. ఆదివారం వైఎస్‌ఆర్‌ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం– చిత్తూరు జట్లు తలపడ్డాయి. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.2 /25.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.2 – 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి నుంచి కడపలో సమావేశాలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, శ్రీనివాసులురెడ్డి, జిల్లా కోశాధికారి బి లక్ష్మీదేవి ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు పాటు కడపలో జరిగే సమావేశాల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. తొలి రోజు కడప నగరంలోని డాక్టర్ అంబేద్కర్ సర్కిల్ నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న అన్ని రంగాల కార్మిక వర్గం ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4నుంచి ప్రారంభమైన పవిత్రోత్సవాలు ముగిశాయి. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పవిత్ర విసర్జనాలు, మహాపూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, పవిత్ర వితరణ తదితర పూజలను అర్చకులు ఆగమోక్తంతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాకు యూరియా రాక

కడప ఎడ్యుకేషన్: జిల్లాకు ఆదివారం 1295 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ వెల్లడించారు. 1295 మెట్రిక్ టన్నులకుగాను జిల్లాకు 846 మెట్రిక్ టన్నులు కేటాయించగా మరో 449 మెట్రిక్ టన్నులు అన్నమయ్య జిల్లాకు కేటాయించారు. వైఎస్సార్ జిల్లాకు కేటాయించిన 846 మెట్రిక్ టన్నుల్లో 239 మెట్రిక్ టన్నుల ప్రైవేటు డీలర్లకు, మరో 200 మెట్రిక్ టన్నులు మన గ్రోమోర్ సెంటర్లకు కేటాయించగా మరో 407 టన్నులు మార్క్‌ఫెడ్‌కు కేటాయించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు కేటాయించిన 449 మెట్రిక్ టన్నులకుగాను 20 టన్నులు ప్రైవేటు డీలర్లకు, 59 మెట్రిక్ టన్నులు మన గ్రోమోర్ సెంటర్లకు, 370 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు చంద్రనాయక్ తెలిపారు.

10న సెమినార్

కడప ఎడ్యుకేషన్: ప్రజా సంఘాల ఐక్యవేదిక సేవ్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ సాయంత్రం యూటీఎఫ్ భవన్‌లో 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు – ప్రభుత్వ రంగ సంస్థలు– విద్యా ప్రజారోగ్యం రంగాలపై ప్రభావం' అనే అంశం మీద నిర్వహించనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌కు ప్రధానవక్తగా రాజ్యసభ ఎంపీ ఆర్. శివధాసన్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కడపలోని పెన్షనర్స్ సంఘం జిల్లా కార్యాలయంలో సెమినార్ కరపత్రాలు, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ పోస్టర్స్ ఆవిష్కరణ ఎల్ఐసీ యూనియన్ నాయకులు ఏ రఘునాథరెడ్డి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు వర్కింగ్ ప్రెసిడెంట్ నాగ ముని రెడ్డి యూటీఎఫ్ నాయకురాలు సుజాత వెంకటేశ్వర రెడ్డి, నాయకులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

- డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని చెప్పారు.

ఉలికిపోయిన ఆశలు

కోటి ఆశలతో దుక్కిదున్నాడు.. రెక్కలు ముక్కలుగా చేసి.. ఒంట్లోని చెమట చుక్కల్ని చిందించాడు. ఒకటా రెండా నాలుగు నెలలపాటు రేయింబవళ్లు శ్రమించాడు.. ఇంతా చేసినా అతని శ్రమకు ఫలితం దక్కలేదు.. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటకు మద్దతు ధర పలకడం లేదు. అంతే పంట చేలో ఉండాల్సిన రైతు రోడ్డెక్కాడు.. మద్దతు ధర లేక.. ప్రభుత్వం నుంచి మద్దతు లేక కడుపుమండి పచ్చని పంటకు మంట పెట్టాడు. రైతన్నకు కడుపు మండితే కూటమి కూసాలు కదిలినట్లేనని శాపనార్థాలు పెడుతున్నాడు. ఆశలు ఒలికిపోయిన ఉల్లి రైతు కంట కన్నీరు పెడుతున్నాడు.

- మద్దతు ధర లేక దిగాలుపడ్డ రైతులు
- జిల్లావ్యాప్తంగా 7532 ఎకరాల్లో ఉల్లి పంటసాగు
- 64 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అధికారుల అంచనా
- క్వింటాల్ 7 నుంచి 8 వందల ధర పలుకుతుందన్న ఉల్లి రైతులు
- సాగు ఖర్చులు కూడా రావని వాపోతున్న అన్నదాతలు



పెండ్లిమర్రి మండలంలో ఉల్లి పంటను కోస్తున్న కూలీలు

జిల్లాలో ఉల్లి అధిక విస్తీర్ణం సాగైన మండల వివరాలు... (ఎకరాల్లో)

మండలం	విస్తీర్ణం
వీరపునాయునిపల్లి	2889
మైదుకూరు	875
వేముల	751
పెండ్లిమర్రి	589
దువ్వూరు	588
తొండూరు	398
వేంపల్లి	373
ఎర్రగుంట్ల	234
ముద్దనూరు	203
కాశినాయన	139

కడప అగ్రికల్చర్: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. పంట చేతికొచ్చే సరికి సరైన గిట్టుబాటు ధర కరువై కంట కన్నీరు ఆగడం లేదు. ఇటు అతివృష్టి.. అటు అనావృష్టితో రైతులు ఏటా నష్టాలపాలవుతున్నారు. అన్నింటికి తట్టుకుని పంట చేతికొస్తే ప్రభుత్వం నుంచి 'మద్దతు' లేక బతుకు బరువుగా మారుతోంది. ముఖ్యంగా ఈ ఏడాది ఉల్లి రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉల్లిపంటకు సరైన మద్దత ధర లేకపోవడంతో రైతులు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతున్నారు. ప్రస్తుతం క్వింటాల్ ఉల్లి ధర రూ.700 నుంచి రూ. 800 పలుకుతోందని ఉల్లి రైతులు తెలిపారు. ఎకరా ఉల్లిపంట సాగుకు సేద్యాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు.. ఇలా అన్ని కలిపి రూ.70 నుంచి 80 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. దిగుబడి కూడా ఎకరాకు 50 నుంచి 70 క్వింటాల్ వరకు వస్తుందని ధర చూస్తే మాత్రం క్వింటాల్ రూ. 700 రూ. 800 పలుకుతుందని తెలిపారు. ఈ ధరకు ఉల్లిగడ్డలు అమ్మితే కనీసం సాగు ఖర్చులు కూడా రావని ఉల్లిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల స్థిరీకరణ నిధి.. ఏదీ..!

రైతులు నష్టపోకుండా ఉండేందుకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలుకాకపోవడంతో ఉల్లి రైతులు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉల్లిపంటకు మద్దతు ధర కల్పించి రైతును ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఉల్లి రైతులు, రైతు సంఘ నాయకుల ఆందోళన

ఉల్లి పంటకు కనీసమద్దతు ధర రూ. 3 వేలు కల్పించాలని శనివారం కడప కలెక్టరేట్ వద్ద రైతులు, రైతు సంఘ నాయకులు భారీ ఎత్తున ఆందోళన చేశారు. రైతులు పండించిన ఉల్లి గడ్డలను రోడ్డుపైన వేసి మంట పెట్టారు. ఈ ఆందోళనకు ఏపీ రైతు సంఘ నాయకులు కూడా మద్దుతు ప్రకటించారు. నాలుగు నెలలపాటు ఇంటిల్లిపాది కంటికి రెప్పలా చూసుకున్న పంటకు కనీస మద్దతు ధర లేకపోతే ఎలా అమ్మాలంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మద్దతు ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకుందామంటే కోల్డ్ స్టోరేజీలు లేకపోవడంతో అదికూడా సాధ్యం కావడం లేదని దీంతో నష్టాలే మూటగట్టుకోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



ఉల్లిగడ్డలకు మంట పెట్టిన రైతులు

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఉల్లి రైతుల పరిస్థితి కొందామంటే కొరివి, అమ్ముదామంటే అడవి అన్న చందంగా మారింది. వేలకు వేలు ఖర్చు పెట్టి ఉల్లిపంటను సాగుచేస్తే దిగుబడి వచ్చే సరికి గిట్టుబాటు ధర లేకుండా పోతోంది. మరో పది పదిహేను రోజుల్లో ఉల్లిపంటను కోయాలి. ఈ ధరలు చూస్తే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– చక్రధర్‌రెడ్డి, ఉల్లి రైతు, సింగసపల్లె, దువ్వూరు

కనీస మద్దతు ధర క్వింటాకు 3వేల రూపాయల కల్పించాలి



ఉల్లి పంటలకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 3 వేలు కల్పించాలి. ప్రభుత్వమేమో రూ. 1200లు ప్రకటించి కొనుగోలు చేస్తామని అంటోంది. ఈ ధరతో అమ్మితే రైతులకు కనీసం పెట్టుబడులు కూడా రావు. ఉల్లి ఎకరం సాగు చేయడానికి సుమారు 80 వేలు దాకా ఖర్చు వస్తుంది. ధర లేక రైతులు నష్టపోతున్నారు.

– గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి.

గ్రహణం ఎఫెక్ట్..

ఆలయాలు మూసివేత



మూసివేసిన దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయం

కడప సెవెన్‌రోడ్స్: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం జిల్లాలోని ఆలయాలను మూసివేశారు. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం భారతదేశంలో ఏర్పడింది. ఈ కారణంగా దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మధ్యాహ్నం 1.50 గంటలకు మూసివేశారు. సోమవారం తెల్లవారుజామున ఉదయం 6.00 గంటల నుంచి భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కల్పించనున్నారు. అలాగే మున్సిపల్ హైస్కూలు వద్దగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం, గడ్డిబజారులోని శ్రీ బాలాజీ ఆలయం, బిల్టప్ వద్దగల శ్రీ విజయదుర్గాదేవి ఆలయం, శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంతోపాటు ఇతర ఆలయాలను కూడా మూసివేశారు.

ఒంటిమిట్ట రామాలయం మూసివేత

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయం ఆదివారం మూతపడింది. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా రామాలయాన్ని మధ్యాహ్నం 1:50 గంటలకు మూసివేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున సుప్రభాతసేవ, ఆలయశుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణ, నివేదన అనంతరం యథావిధిగా భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తామన్నారు.

రాయచోటి వీరభద్రాలయం

రాయచోటి టౌన్: చంద్రగ్రహణం సందర్భంగా రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని మూసివేశారు. అలాగే పాత రాయచోటిలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం, చెక్‌పోస్ట్ వద్ద వెలసిన శ్రీ శివాలయ తలుపులు, యండపల్లె సమీపంలోని శ్రీ భైవరవుడి ఆలయాలను కూడా మూసివేశారు.

ఘనంగా ఆలిండియా నాతియ ముషాయిరా

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని మీలాద్ కమిటీ కార్యాలయంలో పవిత్రమైన మీలాదున్ నబీ మాస ఉత్సవాలను పురస్కరించుకొని ఆల్ ఇండియా నాతియా ముషాయిరా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ జిల్లాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి ప్రఖ్యాత కవులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మీలాద్ కమిటీ ప్రెసిడెంట్ హాజీ మొహమ్మద్ అహ్మదుల్లా, వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, సెక్రెటరీ షేక్ నయీముద్దీన్, ముస్లిం ప్రముఖులు, స్థానిక కవులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ కవి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులకు నియోజకవర్గాల కేటాయింపు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులకు పలు అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వ యం చేసుకుంటూ సంబంధిత రీజినల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరించాలని తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో సింగసాని గురుమోహన్‌కు కడప, మైదుకూరు, కల్లూరు నాగేంద్రారెడ్డికి పులివెందుల, జమ్మలమడుగు, రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి కమలాపురం, బద్వేల్, పీపీ మధుకు ప్రొద్దుటూరు, డోన్ నియోజకవర్గాలను కేటాయించారు.

కుటుంబ బంధాలకు స్ఫూర్తి మరియమాత

కడప సెవెన్‌రోడ్స్: మరియమాత కుటుంబ బంధాలు ఎలా ఉండాలో తన జీవితం ద్వారా తెలుపుతూ విశ్వాసులకు స్ఫూర్తినిచ్చారని కడప మేత్రాసన కోశాధికారి రెవరెండ్ ఫాదర్ ఎస్.సురేష్ అన్నారు. ఆరోగ్యమాత నవదిన ప్రార్థన ఉత్సవాల సందర్భంగా ఆదివారం మరియాపురంలోని సెయింట్ మేరీస్ క్యాథడ్రల్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ మరియన్న దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరియమాతను ఆరోగ్య వరప్రదాయిని అంటారని, విశ్వాసం, నమ్మకాలతో ఆమె సన్నిధికి వచ్చి ప్రార్థించిన వారికి ఆరోగ్యం, ఉపశమనం లభిస్తాయన్నారు. ఆమె చూపిన బాటలో విశ్వాసులంతా నడిచినపుడే శాంతి సమాధానాలు లభిస్తాయన్నారు.

నగరంలో ఆరోగ్యమాత ఊరేగింపు

అనంతరం ఆరోగ్యమాత తేరు ఊరేగింపు మరియాపురం నుంచి నగరంలోని పలు ప్రముఖ కూడళ్ల ద్వారా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రానికి చేరుకుంది. వల్లూరు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ శరత్ ఊరేగింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కడప మేత్రాసన మరియదళ, విన్సెంట్ దె పాల్ సభ్యులు, ఆరోగ్యమాత సభ సిస్టర్లు పాటలు, జపమాల ధ్యానం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు నల్గొండ డాన్‌బాస్కో ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ విల్సన్ ఆధ్వర్యంలో పరిశుద్ధ దివ్య సత్ ప్రసాద ఆరాధన,స్తుతి ప్రార్థనలు, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యమాత యువత ఆధ్వర్యంలో క్రైస్తవ భక్తి గీతాలాపన, నృత్య ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమంలో గురువులు, మఠ కన్యలు, విశ్వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






ఆరోగ్యమాత స్వరూపానికి పూల అలంకరణ చేస్తున్న దృశ్యం, ఊరేగింపులో పాల్గొన్న విశ్వాసులు

అమ్మకానికి ఎర్రబంగారం

ఎర్రచందనం స్మగ్లర్లు శేషాచలం అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన దుంగలను కేంద్రీయ ఎర్రచందనం డిపోలో భద్రపరుస్తారు. వాటికి వేలం పాట నిర్వహించనున్నారు.

- సీఆర్ఎస్ డిపోలో నిల్వలపై దృష్టి
- ప్రస్తుతానికి 135 టన్నులకు వేలం
- ఈనెల 22 నుంచి అక్టోబర్ 6 వరకు వ్యాపారుల సందర్శన





నిల్వ ఉంచి ఎర్రచందనం దుంగలు (ఫైల్)

రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిల్వ ఉన్న ఎర్రచందనం విక్రయించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో అటవీశాఖ ఎర్రచందనం నిల్వలపై దృష్టి సారించింది. కేంద్రీయ డిపో(తిరుపతి)లో ఉన్న ఎర్రచందనం అమ్మేందుకు అన్ని చర్యలను తీసుకుంది. శేషాచలం అటవీ పరిధిలో ఎక్కడ ఎర్రచందనం లభ్యమైనా సెంట్రల్‌డిపోకు తరలిస్తున్నారు. రాజంపేట, కపిలతీర్థంలో కూడా ఎర్రచందనం డిపోలు ఉన్నాయి. వీటి నిల్వల విషయంలో సీఆర్ఎస్ ప్రధానంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతానికి 135 టన్నులు వేలానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని సీఆర్ఎస్ సంబంధిత అధికారి ఒకరు ధ్రువీకరించారు. ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం రాయలసీమ ప్రాంతంలో ఉన్న కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఈ కొండలు దాదాపు 5.5లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, నల్లమల అడవులు తూర్పు కనుమల్లో ఉన్నాయి. వీటిలో శేషాచలం, వెలుగొండలో మాత్రమే అధికంగా ఎర్రచందనం పెరుగుతోంది. ఈ కొండల్లో యురేనియం, ఐరన్, గ్రాఫైట్, కాల్షియం లాంటివి వివిధ నిష్పత్తుల్లో ఉన్నాయి.

రాజంపేట ఎర్రబంగారానికే డిమాండ్

జీవవైవిధ్యఅటవీ ప్రాంతం(బయోస్పెయిర్)గా గుర్తింపు పొందిన శేషాచలం ఎర్రచందనం చెట్లతో ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. ప్రధానంగా శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనం ఎక్కువ చేవ ఉండటంతో దానికి అంతర్జాతీయమార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇందులో రాజంపేట ఎర్రచందనానికి ఎక్కువ డిమాండ్ ఉంది. వైఎస్సార్‌జిల్లాలో 3.2 మిలియన్ల హెక్టార్లలో, అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ల హెక్టార్లలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయి.

ఎర్రచందనం అనే పేరు ఎలా..

ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. టెరోకార్పస్‌సాంటలైనస్ అనేది దీని శాస్త్రీయనామం. టెరో అనే గ్రీకు మాటకు ఉడ్(కర్ర) అని అర్థం. కార్పస్ అంటే పండు. దాని కాయ చాలాగట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. అది మొక్క రావాలంటే ఏడాది పడుతుంది. దీనినే ఎర్రచందనం, రక్తచందనం, శాంటాలం. ఎర్రబంగారం అని కూడా అంటారు.

అటవీప్రాంతం:	శేషాచలం(బయోస్పెయిర్)
అన్నమయ్య జిల్లా:	2.8 మిలియన్ల హెక్టార్లు
వైఎస్సార్ జిల్లా:	3.2 మిలియన్ల హెక్టార్లు

రాజంపేట, రైల్వేకోడూరు పరిధిలో..

రాజంపేట, రైల్వేకోడూరు రేంజ్ పరిధిలో 50 వేల హెక్టార్లలో శేషాచల అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో అధికంగా ఎర్రచందనం ఉంది. ఈ అడువులను జీవావరణ రిజర్వుగా కేంద్రం ప్రకటించింది. ఐదు వేల వృక్షజాతులు మొక్కలు కలిగిన శేషాచల అడవులకు బయోస్పియర్ రిజర్వుగా ప్రకటించారు. ఈ అడవులో 1700పైగా పుష్పించే జాతి మొక్కలు ఉన్నాయి.



దుంగలన్నీ ఒకచోటికి..

స్మగ్లర్ల అక్రమరవాణా నేపథ్యంలో ఎల్లలు దాటిన ఎర్రచందనాన్ని, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్మగ్లర్లు అక్రమంగా నిల్వ చేసిన ఎర్రదుంగలను, అటవీ, పోలీసు,కస్టమ్స్‌శాఖల వద్ద వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనాన్ని ఒకచోటికి రప్పించి భద్రపరిచే పనులకు నాలుగేళ్ల క్రితం అటవీశాఖ శ్రీకారం చుట్టింది. టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఏర్పాట్లు చేసింది. తిరుపతి కేంద్రీయ ఎర్రచందనం డిపోకు జిల్లాలోని డిపోలో నిల్వ ఉంచిన వాటిని తరలిస్తారు. అక్కడే వేలంపాట నిర్వహించనున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

డిమాండ్ ఎందుకు..

చైనా, జపాన్‌లలో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలుకూడా ఎర్రచందనంతో తయారు చేసినవి వాడుతుంటారు. సంగీతవాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తుంటారు. రష్యా వాళ్లు కూడా ఎర్రచందనం కొనుగోలు చేస్తుంటారు. అందులో ఔషధగుణాలు ఉన్నాయి. వయగ్రా, కాస్మెటిక్, ఫేస్ క్రీమ్ లాంటి వాటిలో వీటిని వాడతారు. అల్సర్‌ను తగ్గించే గుణం, కిడ్నీ సమస్యలు, రక్తాన్ని శుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్రచందనంలో ఉంటాయని నిపుణులు అంటున్నారు.

- విదేశాలకు తరలిపోకుండా ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాంటీ స్మగ్లర్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. శేషాచలం అడవుల్లో నిత్యం కూంబింగ్ చేస్తూ చెట్లను నరకకుండా అడ్డుకుంటోంది. 2015లో ఏర్పాటైన ఈ టాస్క్‌ఫోర్స్‌లో పోలీసు, ఫారెస్టు, ఏపీఎస్‌పీ, సివిల్ పోలీసు డిపార్టుమెంట్ల సిబ్బంది ఉంటారు. తిరుపతి హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. గత 15 సంవత్సరాల్లో 15 లక్షల టన్నుల ఎర్రచందనం విదేశాలకు తరలిపోయింది.
- సీఆర్ఎస్ డిపోలోని నిల్వ ఉన్న మూడు రకాల ఎర్రబంగారం వేలంపాటకు సిద్ధమైంది. ఈ-సేల్ ద్వారా అమ్మకాలు సాగించనున్నారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 6 వరకు ఎర్రబంగారు కొనుగోలు దారులు డిపో సందర్శించే అవకాశం కల్పించారు. చిప్స్, బటన్స్, రూట్స్ రకాలను వేలంపాటలో అమ్మకానికి సిద్ధం చేశారు. రేట్ విషయంపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయనుంది.

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మైలవరం : మండల పరిధిలోని ధన్నవాడ గ్రామానికి చెందిన మద్దిరాల చెన్నప్ప (52) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గత 3 ఏళ్లుగా వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పులు ఎక్కు కావడం వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌లు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స కోసం వచ్చిన గుర్తు తెలియని వృద్ధుడు (60) కొంత సమయానికి మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో వుంచారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు వుంటే తగిన ఆధారాలతో తమను సంప్రదించాలనీ రిమ్స్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

లాండ్రీ షాపులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మైదుకూరు : లాండ్రీ నిర్వహిస్తున్న ఓ ఇంటిలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు రాజారెడ్డి వీధిలో ఉంటున్న కంచర్ల ఆంజనేయులు నివాసం ఉంటున్న ఇంటిలోనే లాండ్రీ నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం స్విచ్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగి అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఫ్రిడ్జ్, మోటార్, టీవీ, బియ్యంతోపాటు ఇంట్లో ఉంచిన బంగారు ఆభరణాలు, నగదు, శుభ్రం చేసి ఇస్త్రీ చేసేందుకు తీసుకొచ్చిన పలువురి పట్టుచీరలు, దుస్తులు అగ్నికి ఆహుతి అయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ప్రొద్దుటూరు అగ్నిమాపక కేంద్రం నుంచి అగ్నిమాపక అధికారి పి.బసివి రెడ్డి, సిబ్బంది వీరనన్న, రవికుమార్, భాస్కర్, కరీముల్లా సంఘటన జరిగిన ఇంటి వద్దకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు ఆంజనేయులు కోరారు.

ప్రాణం తీసిన ఈత సరదా



మృతి చెందిన వెంకటేష్

ప్రొద్దుటూరు క్రైం : ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. ఈ సంఘటన ప్రొద్దుటూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చౌడూరు గ్రామానికి చెందిన బత్తల వెంకటేష్ (28) స్నేహితులతో కలిసి సరదాగా పెన్నానదికి వెళ్లాడు. అక్కడ స్నేహితులందరూ కలిసి భోజనం చేశారు. కొంత సేపు వారంతా సరదాగా గడిపారు. ఈ క్రమంలో పెన్నానదిలో ఈత కోసం దిగిన వెంకటేష్ నీళ్లలో గల్లంతయ్యాడు. కొంత సేపు తర్వాత ఊపిరాడకపోవడంతో అతను మృతి చెందాడు. ఎస్‌ఐ రాజు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నొప్పి మాయం.. సర్జరీ దూరం

- ఫిజియోథెరపీ దివ్య ఔషధం
- దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం
- రిమ్స్‌లో ప్రత్యేక వైద్య సేవలు
- నేడు ఫిజియోథెరపీ దినోత్సవం





కడప రిమ్స్‌లో ఫిజియోథెరపీలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, విద్యార్థులు

కడప అర్బన్ : ప్రపంచ వ్యాప్తంగా ఏటా సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని జరుపుకొంటారు. ఫిజియోథెరపీ ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. మారిన జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, కంప్యూటర్ల ముందు ఎక్కువ సేపు కూర్చోవడం వంటి కారణాలతో అనేక మంది యువత, పెద్దలు కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి, మెడనొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలకు మందులు లేకుండా ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించి, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఫిజియోథెరపిస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తున్నారు.

ఫిజియోథెరపీ ఎందుకు అవసరం?

ఆధునిక జీవనంలో ఫిజియోథెరపీ అవసరం రోజు రోజుకు పెరుగుతోంది. పుట్టుకతో వచ్చే వైకల్యాలు, ప్రమాదాల వల్ల కలిగే గాయాలు, పక్షవాతం, మానసిక ఒత్తిడి వంటి అనేక ఆరోగ్య సమస్యలకు ఫిజియోథెరపీ అద్భుతమైన చికిత్సగా నిలుస్తోంది. వ్యాయామాల ద్వారా, చేతితో చేసే చికిత్సల ద్వారా (మాన్యువల్ థెరపీ)తోపాటు, ఇతర పద్ధతుల ద్వారా శారీరక కదలికలను మెరుగుపరచి, నొప్పిని తగ్గించి, జీవిత నాణ్యతను పెంచడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా, వయసు పెరిగే కొద్దీ వచ్చే కీళ్ల నొప్పులు, బలహీనత వంటి వాటిని నియంత్రించడంలో, ఎముకల సాంద్రతను పెంచడంలో కూడా ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుంది.

పీడియాట్రిక్ ఫిజియోథెరపీ..

పిల్లల భవిష్యత్తు కోసం..

పిల్లల ఆరోగ్యానికి పీడియాట్రిక్ ఫిజియోథెరపీ ఎంతో అవసరం. పుట్టినప్పటి నుంచి వచ్చే కండరాల బలహీనత, శరీర భాగాల కదలికలో సమస్యలు, మెదడు పక్షవాతం (సెరెబ్రల్ పల్సీ) వంటి సమస్యలకు ఈ చికిత్స చాలా ఉపయోగపడుతుంది. ఫిజియోథెరపిస్టులు వ్యాయామాల ద్వారా పిల్లల శారీరక సామర్థ్యాన్ని పెంచుతారు. దీనివల్ల వారు నడవడం, కూర్చోవడం, చేతులు ఉపయోగించడం వంటివి సులభంగా నేర్చుకుంటారు. పిల్లలు సాధారణ జీవితం గడపడానికి, స్కూల్‌కి వెళ్లడానికి, ఆత్మవిశ్వాసంతో ఉండటానికి ఈ చికిత్స దోహదపడుతుంది.

ఫిజియోథెరపీలో మహిళల పాత్ర

గర్భధారణ, ప్రసవం, రుతుక్రమం వంటి సందర్భాల్లో మహిళలు ఎదుర్కొనే శారీరక సమస్యలకు ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగపడుతుంది. సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది మహిళలు ఈ చికిత్సను ఉపయోగించుకోవడం లేదు. ఫిజియోథెరపీ ద్వారా ఈ సమస్యలను అధిగమించి, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చు.

కడప రిమ్స్‌లో ఫిజియోథెరపీకి ప్రత్యేక వైద్యం

కడప రిమ్స్‌లో ఫిజియోథెరపీ విభాగంలో ప్రతి రోజు మేల్, ఫిమేల్ ఓపీలో సుమారు 70 నుంచి 80 మంది పేషెంట్స్ ఫిజియో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ప్రజలకు సంపూర్ణ వైద్య విధానంలో ఫిజియోథెరపీ చేస్తున్నారు. ఇక్కడ ఫిజియోథెరపీ సంబంధంగా పీడియాట్రిక్స్, జీనియాట్రిక్స్ ఎలక్ట్రో థెరపీ, ఎక్సర్సైజ్ థెరపీ పరికరాలతో విద్యార్థులు, ట్రైనీ డాక్టర్లతో పక్షవాతం, కీళ్ల నొప్పులు, పోస్ట్ ఆప్, ఆర్థో సర్జరీలకు, ఎముకల, నరాల సంబంధం అగు మరి ఎన్నో వ్యాధులకు రిమ్స్‌లో ఫిజియో విభాగం లో చికిత్స పొందుతున్నారు. ఇక్కడ ప్రత్యేకంగా ఆర్థో, న్యూరో, కార్డియో, పిడియాట్రిక్స్ సర్జరీస్ భాగాలకు, తదితర అవసరమైన విభాగాలకు ఫిజియోథెరపీ చికిత్స చేయడం జరుగుతుంది. నూతన లేజర్, యుఆర్‌థెరపీ ద్వారా పిల్లల నుంచి పెద్దల వరకు వయోవృద్ధుల వరకు కూడా చికిత్స ఇవ్వడం జరుగుతుంది. కడప, ఇతర ప్రాంతాల నుంచి చికిత్స మేరకు ఇక్కడికి రావడం జరుగుతుంది.

ఫిజియోథెరపీని ప్రోత్సహించాలి



వైద్యులు, ఫిజియోథెరపీ నిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై అవగాహన కల్పించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఫిజియోథెరపిస్టుల కోసం ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించాలని కూడా అసోసియేషన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ప్రజలు కూడా మందులపై ఆధారపడకుండా ఫిజియోథెరపీ చికిత్సను స్వీకరించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మా విభాగంలో ముగ్గురు ఫిజియోథెరపిస్టులు 30 మంది సిబ్బంది ద్వారా ఇక్కడ చికిత్స ఇవ్వడం జరుగుతుంది. సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ ప్రోత్సాహంతో నూతన పరికరాలు, ప్రక్రియలతో ఫిజియోథెరపీ విభాగం అభివృద్ధి చెందుతోంది.

– డాక్టర్ సంపత్ కుమార్, హెచ్ఓడీ, ఫిజియోథెరపీ విభాగం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

బంగారు దుకాణ గుమస్తాపై దాడి

ప్రొద్దుటూరు క్రైం : బంగారు ఆభరణాలకు సంబంధించి డబ్బు అడిగినందుకు దుకాణ గుమస్తాపై దాడి చేసిన ఘటనలో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న సాబిర్ కొన్నేళ్ల నుంచి బంగారు వ్యాపారం చేస్తున్నాడు. గాంధీరోడ్డుకు చెందిన షేక్ నూర్ అనే వ్యక్తి సాబిర్ వద్ద బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తూ రెండు వారాల్లోపు నగలకు సంబంధించిన డబ్బు ఇచ్చేవాడు. ఈ క్రమంలో రోజు మాదిరి కాకుండా ఎక్కువ బంగారు కావాలని సాబిర్‌ను కొన్ని రోజుల క్రితం నూర్ అడిగాడు. ఎక్కువ బంగారు కదా పూచీ ఎవరుంటారని సాబిర్ అడగ్గా తన తమ్ముళ్లు షేక్ ఇలియాస్, మహమ్మద్‌రఫిలను తీసుకెళ్లి మాట్లాడించాడు. నూర్ డబ్బులు ఇవ్వకుంటే తాము ఇస్తామని వారు ఒప్పుకొన్నారు. ఈ క్రమంలో సాబిర్ వద్ద అతను జూన్ 17న 256.950 గ్రాములు, జూలై 3న 195.670 గ్రాముల బంగారు ఆభరణాలు తీసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత బంగారు నగల డబ్బులు ఇవ్వాలని సాబిర్ తన గుమస్తా అయిన ఖాజావలితో అడిగించాడు. అందుకు నూర్ సరిగా సమాధానం ఇవ్వలేదు. దీంతో ఈ విషయాన్ని నూర్ తమ్ముళ్లు అయిన షేక్ ఇలియాస్, షేక్ మహమ్మద్ రఫికి చెప్పాడు. ఈ నెల 2న కూడా ఖాజావలి ఫోన్ చేసి డబ్బు అడుగగా నూర్ అసభ్యకరంగా మాట్లాడి డబ్బులు ఇచ్చేది లేదని బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతేగాక ఖాజావలి ఇంటికి వెళ్తున్న సమయంలో నూర్ దాడి చేయడంతో గాయాలయ్యాయి. బంగారు నగలు తీసుకొని డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడంతోపాటు దుకాణ గుమస్తా ఖాజావలిపై దాడి చేశాడని సాబిర్ శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నూర్‌తోపాటు పూచీ పడిన అతని సోదరులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నాణ్యమైన వైద్యం పేదలకు దూరం

- వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం దారుణం
- దేశ చరిత్రలో తొలిసారిగా 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే ప్రైవేటీకరణ రద్దు
- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం నాణ్యమైన వైద్యాన్ని పేద ప్రజలకు దూరం చేస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. ఆదివారం కడపలో తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో తొలిసారిగా 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి కేబినెట్‌లో ఆమోద ముద్ర వేయడం దారుణమన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం యత్నించడం దారుణమన్నారు. కొత్త వైద్య కళాశాలల మంజూరు కోసం చాలా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయని, అయితే మన రాష్ట్రంలో మాత్రం ఇప్పటికే సిద్ధంగా ఉన్న మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 11 మెడికల్ కాలేజీలే ఉన్నాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలని 17 కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారన్నారు. వీటి నిర్మాణానికి రూ.8500 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు మొదటి ఏడాది 5 మెడికల్ కాలేజీలు పూర్తి చేశారని, రెండో ఏడాది మరో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేశారన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీ కూడా అందులో ఉందన్నారు. ఈలోపు ఎన్నికలు రావడంతో మూడు కాలేజీలకు మాత్రమే అనుమతులు వచ్చాయన్నారు.

కేంద్రం సీట్లు కేటాయించినా..

పులివెందుల మెడికల్ కాలేజీకి కేంద్రం 50 మెడికల్ సీట్లు కేటాయిస్తే, నిర్వహణ తమ వల్ల కాదంటూ కేంద్రానికి లేఖ రాసిన చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కాలేజీలు ఉంటే పేద విద్యార్థులు వైద్య విద్యను తక్కువ ఫీజులతోనే పూర్తి చేసే అవకాశముంటుందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రైవేటు పరం చేయడం వల్ల మెడికల్ సీట్లు కోట్ల రూపాయలకు అమ్ముకునే అవకాశముందని, పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆరోగ్య సేవలు పేదలకు అందుబాటులో ఉండవన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు పరం చేయడమే పరమావధిగా పెట్టుకుంటారని విమర్శించారు. విద్యారంగంలో 6 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని, నారాయణ, చైతన్య విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఖరి వల్ల ప్రభుత్వ విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు ఉపయోగిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఈ దుబారా ఖర్చు తగ్గిస్తే ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించవచ్చన్నారు.

కమీషన్ల కోసం పన్నాగం

ప్రభుత్వ ఆస్తులను అప్పనంగా ప్రైవేటుకు దోచిపెట్టి కమీషన్లు కాజేయడానికి పన్నాగం పన్నుతున్నారన్నారు. అపర సంజీవని ఆరోగ్యశ్రీని బీమా పద్ధతిలో అమలు చేస్తూ దేశంలోనే అత్యుత్తమంగా అమలైన విధానానికి బాబు సర్కారు ఉరి వేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణ రద్దు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, సుదర్శన్, గుంటి నాగేంద్ర, రెడ్డి ప్రసాద్, బసవరాజు, శంకరాపురం సింధు, సాయిదత్త, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



జిల్లా స్థాయి బాలుర బాల్ బ్యాడ్మింటన్ జట్టుతో నిర్వాహకులు

జమ్మలమడుగు రూరల్ : వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా (వైఎస్సార్, అన్నమయ్య) జిల్లా స్థాయి జూనియర్ బాల బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఆదివారం జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికలను జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్ణమూర్తి, వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని మండలాల నుంచి దాదాపు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జూనియర్ జిల్లా జట్టుకు బాలురు 10 మందిని, బాలికలు 10 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12, 13, 14వ తేదిల్లో అనంతపురం జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కన్వీనర్ ఓబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, సెలక్షన్ కమిటీ మెంబర్లు, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు

మహమ్మద్ బాబా (రాజంపేట) కె.కౌశిక్, హైడెన్, డి.రాజేష్, వెంకటేశ్, చిన్న ఓబులేసు (దువ్వూరు) డి.షద్రక్, రఫేల్ (చిన్న సింగనపల్లె) ఎస్.మురళి, రాజు (ఒంటిమిట్ట) ఎస్. షాజిద్(రాజంపేట)

జిల్లా బాలికల జట్టు

డి.కీర్తి, డి.నయోమి (చిన్న సింగనపల్లె) ఎం.స్వీటీ (ఎస్.ఉప్పలపాడు) జి.వర్షిణీ (త్గాళ్ల ప్రొద్దుటూరు) ఎం.గౌతమి, జి.సునంద, కె.చెర్లీన్, ఎస్.అశ్వినీ, ఎస్.లక్ష్మీ (చియ్యపాడు)

సౌత్‌జోన్ అండర్–23 మల్టీడే మ్యాచ్‌లు ప్రారంభం



చిత్తూరు తేజరెడ్డి, 73 పరుగులు



చిత్తూరు ముఖేష్, 4 వికెట్లు



నెల్లూరు అఖిల్, 5 వికెట్లు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం అయ్యాయి. ఆదివారం వైఎస్‌ఆర్‌ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 50.5 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని అర్జున్ టెండ్యూలర్ 64, వికాస్ 53 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ముఖేష్ చక్కగా అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. రెడ్డి ప్రకాశ్ 2, బాలాజీ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 33 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని తేజరెడ్డి 73, రెడ్డి ప్రకాశ్ 20 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని ప్రమోద్ కుమార్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. దీంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 43.5 ఓవర్లకు 257 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని భరత్‌రెడ్డి 66, ఎస్ఎండి ఆయూబ్ 51, శివ కేశవ 41 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని అఖిల్ 5, ఇకాక్షర్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 35.5 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 140 పరుగులు చేసింది. ఆ జట్టులోని సోహాన్ వర్మ 53, శ్రీహర్ష 31 పరుగులు చేశారు. కడప జట్టులోని వరుణ్‌తేజ్ రెడ్డి 3 వికెట్లు, చెన్నారెడ్డి 1 వికెట్ తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీల్లో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా సాగాయి. అండర్ –18, 20 స్త్రీ,పురుషులకు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, హైజంప్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ పోటీల్లో 20 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 26, 27 తేదీల్లో ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ పోటీలను వ్యాయామ సంచాలకులు శివారెడ్డి, రాఘవ, నాగేశ్వరరావు, ఖాదర్‌రెడ్డి, దిలీప్, హసీనా, బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాషా పర్యవేక్షించారు.

కాపర్ వైరు చోరీ

బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల గ్రామానికి చెందిన రమణయ్య, తిరుపతి, అయ్యపురెడ్డి పొలాల్లోని ఏపీఎస్‌పీడీసీఎల్‌కు సంబంధించిన మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ సంఘటనపై బాధిత రైతులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపడతామని ఎస్‌ఐ వెంకటసురేష్ తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో చోరీకి గురైన కాపర్‌వైరు

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

రౌడీ షీటర్‌పై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్లు ఇచ్చి, ఆపై ఇంట్లోకి తీసుకెళ్లి రౌడీషీటర్ రాజ్‌కుమార్ లైంగిక దాడికి యత్నించిన ఘటన భగత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో భగత్‌సింగ్ నగర్‌లో ఐదేళ్ల చిన్నారి ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి ఆడుకుంటున్న సమయంలో.. అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ రాజ్‌కుమార్ చాక్లెట్ ఇచ్చి ఎత్తుకొని తన ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే పాప కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. రాజ్ కుమార్ చిన్నారిని తీసుకెళ్లాడని స్థానికులు చెప్పడంతో.. చిన్నారి తల్లి రౌడీషీటర్ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో బాలిక డ్రెస్‌ను రాజ్‌కుమార్ తొలగిస్తుండగా చూసిన ఆమె గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి అతనికి దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, కడప తాలూకా సీఐ రెడ్డెప్ప, ఎస్సై తులసి నాగప్రసాద్, తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రౌడీషీటర్ రాజకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర కల్పించని ప్రభుత్వం

- అన్నదాత సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళన
- 9న రైతు పోరును జయప్రదం చేయండి
- ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



రైతు పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

జమ్మలమడుగు : రాష్ట్రంలో ఏ పంటకూ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 9న జరిగే రైతు పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన మిర్చి, శనగ, ఉల్లి, చీనీ, అరటి, మినుముల పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక పూర్తిగా నష్టపోయారని పేర్కొన్నారు. పండించిన పంటను అమ్ముకోలేక, ప్రభుత్వం నుంచి సహాయం అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారన్నారు. కర్నూలు జిల్లాలో రైతులు ఉల్లికి మద్దతు ధర లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రైతులు రోడ్డుపైకి రావలసిన పరిస్థితి వచ్చిందన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేని పరిస్థితిలో ఉందన్నారు.

రైతులపై చిన్నచూపు

హార్టికల్చర్ మాజీ చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు గౌరవం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఎరువులు, యూరియా కొరత ఉందని చెబితే.. భోజనానికి పోతే క్యూలో నిలబడమా, రైతులు కూడా ఎరువుల కోసం క్యూలో నిలబడ్డారు అంటూ మంత్రి అచ్చెన్నాయుడు హేళన చేసి మాట్లాడటం తగదన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరిలో యూరియా వేయడం వల్ల రోగాలు వస్తాయని, రైతులు వరి పంట వేయవద్దు అంటూ సలహాలు ఇస్తున్నారన్నారు. రైతులకు కావలసిన యూరియా అందిస్తామని ఎక్కడా చెప్పడం లేదన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో రైతులు ఏ రోజు యూరియా కావాలంటూ రోడ్డున పడ్డ దుస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి రైతులంటే అలుసైపోయిందని వారిపై అక్రమ కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, ముల్లాజానీ, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బొనం సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి దుర్మరణం



మృతి చెందిన ఖాదర్ హుస్సేన్

మైదుకూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆదివారం చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి బైపాస్‌పై కలసపాడుకు చెందిన వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగి షేక్ ఖాదర్ హుస్సేన్ (52) దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కలసపాడులోని పోలేరమ్మ వీధికి చెందిన ఖాదర్ హుస్సేన్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం బ్యాంక్ పని మీద వెళుతున్నాను అంటూ భార్య ఫాతిమాకు చెప్పి మోటార్ బైక్‌పై బయల్దేరారు. మైదుకూరు శివారులో జాతీయ రహదారి బైపాస్‌పైన ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సంఘటనలో బైక్‌పై ఉన్న ఆయన తీవ్ర రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని మైదుకూరు అర్బన్ పోలీసులు పరిశీలించి ఖాదర్ హుస్సేన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. మృతునికి మొదటి భార్య ద్వారా ఒక కుమారుడు, ఆమె మృతి చెందిన తర్వాత చేసుకున్న రెండో భార్య ఫాతిమాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.